కియోస్క్ సేవలకు మంగళం



బీకేఅగ్రహారం రైతుసేవా కేంద్రంలో మూలనపడిన కియోస్క్



కియోస్క్ ద్వారా రైతులకు సేవలందిస్తున్న ఏఓ (ఫైల్)

రైతుసేవా కేంద్రాల్లో మూలనపడిన కియోస్క్‌లు

- నిలిచిన ఎరువులు, పురుగు మందుల విక్రయాలు
- సొసైటీలు, ప్రైవేట్ డీలర్ల వద్దకు రైతుల పరుగులు

జలదంకి: గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో రైతులకు ఎన్నో విధాలుగా అండగా నిలిచిన రైతుభరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసే దిశగా ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఒకప్పుడు వ్యవసాయం దండగా అంటూ రైతులను నిరాశ పరిచిన చంద్రబాబు నేడు ఆర్బీకే సేవలకు మంగళం పాడే పనిలో పడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్‌బీకేల్లోని కియోస్క్‌ల ద్వారా నమోదు చేసుకున్న రైతులకు ఇంటి ముంగిటకే ఎరువులు, పురుగు మందులను అందించగా, నేడు ఆ సేవలను కొత్త ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో రైతులు ఎరువులు, పురుగు మందుల కోసం ప్రైవేట్ డీలర్లు, సొసైటీల వద్దకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులకు అన్ని రకాల సేవలను ఇంటి ముంగిటకే అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటి ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను గ్రామ స్థాయిలోనే అందించింది. రైతులకు అన్ని రకాల సేవలను పారదర్శకంగా అందించేందుకు కియోస్క్‌లను ఏర్పాటు చేసింది. వాటి ద్వారా నమోదు చేసుకున్న రైతులకు ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్, యంత్ర పరికరాలు, తదితరాలను ఇంటి ముంగిటకే పంపిణీ చేసింది. దీంతో రైతులకు మండల కేంద్రాలకు పరుగులు తీసే బాధ తప్పింది. అయితే కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల పేరును రైతుసేవా కేంద్రాలుగా మార్చడం తప్ప మిగిలిన సేవలకు మంగళం పాడుతూ వస్తోంది. రైతులకు సేవలందించే కియోస్క్‌లను మూలన పడేసింది. ఎరువులు,మందుల విక్రయాలను నిలిపివేసింది.

కియోస్క్‌ల ప్రత్యేకతలు

గత ప్రభుత్వ హయాంలో రైతుభరోసా కేంద్రాల్లో డిజిటల్ కియోస్క్‌లను ఏర్పాటు చేశారు. రైతులకు పారదర్శకంగా సేవలందించే లక్ష్యంతో ఆండ్రాయిడ్ సాంకేతిక పరిజ్ఞానంతో నడిచే ఈ మెషిన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటి ద్వారా రైతులే నేరుగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలు, రైతులు పండించిన పంటలకు ఉన్న మార్కెట్ ధరలు, దగ్గరలో ఉన్న మార్కెటింగ్ వివరాలు తదితర సేవలను పొందే అవకాశం కల్పించారు. వాతావరణ సమాచారం, ఏ సమయంలో ఏ పంటలు వేయాలన్న సమగ్ర సమాచారాన్ని అందులో పొందుపరిచి రైతులకు అందించేవారు.

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

జలదంకి మండలంలో పదమూడు రైతుసేవా కేంద్రాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని రైతుసేవా కేంద్రాల్లోని కియోస్క్‌లు నిరుపయోగంగా మారాయి. కనీసం ఎరువులు బుక్ చేసేందుకు కూడా ఉపయోగించడం లేదు. ప్రతి కేంద్రంలోని కియోస్క్‌లను మూలన పడేశారు. గతంలో రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగుమందులకు ఇండెంట్ పెడితే సరఫరా చేసేవారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ముమ్మరంగా సాగుతున్నా కియోస్క్‌లు ఉపయోగంలో లేకపోవడంతో రైతులు ఆ సౌకర్యాలను పొందలేకపోతున్నారు. యాజమాన్య పద్ధతులు, మార్కెట్ ధరలు వంటి సమాచారం తెలుసుకునే వీలు లేకుండాపోయింది. గతంలో ఆర్బీకేల ద్వారా ఎరువులు పూర్తి స్థాయిలో అందించేవారు. ఇప్పుడు ఎరువులు అందకపోవడంతో రైతులు ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

సేవలను కొనసాగించాలి



గత ప్రభుత్వంలో కియోస్క్ ద్వారా నమోదు చేసుకున్న రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందజేసేవారు. వ్యవసాయ యంత్రాలు, పంటల ఉత్పత్తి, మార్కెటింగ్, తదితర సేవలు అందేవి. గతంలో మాదిరిగానే కియోస్క్ ద్వారా అన్ని రకాల సేవలను కొనసాగించాలి.

– రావి ప్రసాద్, సర్పంచ్, కేశవరం పంచాయతీ

ఎరువులు అందజేయాలి



వ్యవసాయ సీజన్ ప్రారంభమై నెల గడిచినా కూటమి ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులను, విత్తనాలను అందించలేకపోతోంది.గతంలో ఆర్బీకేలో నమోదు చేసుకుంటే ఇంటి ముంగిటే ఎరువులు అందజేసేవారు. ప్రస్తుతం ఎరువుల కోసం ప్రైవేట్ డీలర్లను ఆశ్రయించి అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. గతంలో మాదిరిగా రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువులను అందజేయాలి.

– మాల్యాద్రి, రైతు, జలదంకి

మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలవాలి

కావలి: మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలవాలని మత్స్యకార సంక్షేమ నాయకుడు, సామాజిక కార్యకర్త ఐ సాయిప్రసాద్ మత్స్యకార దినోత్సవం సందర్భంగా గురువారం ఒక ప్రకటనలో కోరారు. మత్స్య కారులను ఎస్టీ జాబితాలో చేర్చి సంక్షేమానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సముద్ర జలాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మత్స్యసంపద పెరుగుతుందని, తద్వారా ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. సముద్ర జలాలు కలుషితం కావడం వల్ల తీరం సమీపంలోని చేపలు చనిపోయి మత్స్య సంపద కరువవుతోందన్నారు. దీని వల్ల చేపలు దొరకక మత్స్యకారులు పొట్టకూటి కోసం ఇతర రాష్ట్రాలకు తరలివెళుతున్నారని తెలిపారు. మత్స్యకారులకు రాయితీపై డీజిల్, మర పడవలు, ఇంజిన్ బోట్లు, తదితరాలు అందించి ఆదుకుని మత్స్యసంపద ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుకోవాలని కోరారు.

నూరు శాతం సబ్సిడీపై ఆయిల్‌పామ్ మొక్కలు



చేజర్ల: ప్రభుత్వం ఉద్యాన పంటలు సాగుకు ప్రోత్సాహాన్ని అందజేస్తోందని ఉద్యాన శాఖ అధికారిణి పీ లక్ష్మి తెలిపారు. చేజర్లలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఉద్యాన పంటల సాగుపై గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు నూరుశాతం సబ్సిడీపై మొక్కలు అందజేస్తున్నట్లు తెలిపారు. సూక్ష్మసేద్యం పరికరాలను సబ్సిడీపై అందజేస్తోందని వివరించారు. క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని వీఏఏలకు సూచించారు. ఏఓ శశిధర్ పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి భూమిపూజ



వరికుంటపాడు: మండలంలోని గణేశ్వరపురంలో కోదండరామస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజను గురువారం నిర్వహించారు. వేదపండితులు బోజనంపల్లి రంగనాయకులు, సత్యనారాయణ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా భూమి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. టీటీడీ నిధులు రూ.66 లక్షలు, గ్రామస్తుల భాగస్వామ్యం రూ.33 లక్షలు వెచ్చించి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఏడాదిలోగా ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

భూఆక్రమణలపై ఆర్డీఓ పరిశీలన



మర్రిపాడు: మండలంలోని పొంగూరులో సర్వేనంబర్ 1283లోని భూమిని పలువురు ఆక్రమిస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని రెవెన్యూ సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. ఆర్‌హెచ్‌కు, 1బీ, అడంగల్‌లో భూమి వివరాలు తేడాగా ఉండడాన్ని గుర్తించారు. తహసీల్దార్ కోర్టు నిర్వహించి నివేదికలు అందజేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌ను ఆదేశించారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

క్రీడాకారులకు అభినందన



ఉదయగిరి: బాపట్లలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మూడ్రోజుల పాటు జరిగిన క్రీడా, కల్చరల్ పోటీల్లో ఉదయగిరి మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వర్సిటీ స్థాయిలో 18 జట్లు పాల్గొనగా, అందులో ఉదయగిరి వ్యవసాయ కళాశాలకు చెందిన చాందినీ, హరిప్రియ, పూర్ణిమ, యశస్వీ, వెంకటనాగలక్ష్మి, భూమిక, సత్యసమీర, నాగజ్యోతి, జీవన, పల్లవి వివిధ విభాగాల్లో ప్రతిభకనబరిచి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా వారిని కళాశాల అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు గురువారం అభినందించారు.

20 వరకు బ్రూసెల్లోసిస్ నివారణ టీకాలు

కలిగిరి: మండలంలోని 4 నుంచి 8 నెలల వయస్సు ఉన్న పెయ్య దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని కలిగిరి ప్రాంతీయ పశువైద్యాశాల ఏడీ కే సురేష్‌బాబు గురువారం తెలిపారు. పాడి పశువుకు ఒకసారి టీకా వేయిస్తే జీవిత కాలం బ్రూసెల్లోసిస్ వ్యాధితో ఈసుకుపోకుండా కాపాడుకోవచ్చని చెప్పారు. డిసెంబర్ 20వ తేదీ వరకు వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. పాడిరైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

ఉదయగిరి: విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ పేర్కొన్నారు. మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని బిజ్జంపల్లి హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాద్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. ఆయన నెహ్రూ, గాంధీ వంటి నేతలతో కలిసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యానంతరం దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విధులు నిర్వహించి విద్యావ్యాప్తికి ఎంతో కృషిచేశారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

కష్టపడి చదవాలి



వరికుంటపాడు: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని విరువూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బీ రమాదేవి అన్నారు. గురువారం పాఠశాలలో చదువులో ప్రతిభ కనబరుస్తున్న గుబిలి తరుణ్‌తేజకు హిందీ ఉపాధ్యాయిని పీ స్నేహలత దాత సహకారంతో సైకిల్‌ను బహుమతిగా అందజేశారు.

మహిళా మార్టుపై ఆడిటింగ్

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులో మూతపడిన మహిళా మార్టుపై పూర్తి స్థాయి విచారణలో భాగంగా ఆర్థికపరమైన లావాదేవీల రికార్డులను డీపీఎం రాజు ఆధ్వర్యంలో ఏపీఎంలు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ డీఆర్డీఏ పీడీ ఆదేశాల మేరకు మార్టుకు సంబంధించిన లావాదేవీలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు. మరో మూడు రోజుల పాటు రికార్డులను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. అలాగే జిల్లా సమాఖ్యకు వింజమూరు సంఘమిత్ర నుంచి ఇద్దరిని ఎంపిక చేసే కార్యక్రమాన్ని పూర్తి చేశామని తెలిపారు.

24న బ్రాహ్మణ వనసమారాధన

వరికుంటపాడు: జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో ఈ నెల 24న నెల్లూరులోని సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మి దేవస్థానంలో ఆదివారం ఉదయం 8 గంటలకు బ్రాహ్మణ వన సమారాధన నిర్వహిస్తున్నట్లు ఉదయగిరి ఉదయాద్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు ఎస్వీఎస్ వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక దామోదర మహారుద్రాభిషేకం, సామూహిక రమా సహిత సత్యనారాయణస్వామి వ్రతం, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయగిరి ప్రాంత బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు. గురువారం ఆయన ఎస్సైలు షేక్ జిలానీ, సాయిప్రసాద్, సీసీ కెమెరాల టెక్నీషియన్ మన్సూర్‌తో కలిసి సీసీకెమెరాల ఏర్పాటుపై పరిశీలన చేశారు. గతంలో కొందరు దాతల ఆర్థిక సహకారంతో కొన్ని ప్రాంతాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రస్తుతం పట్టణ ఆర్యవైశ్య అసోసియేషన్ అందజేసిన రూ.50వేలతో మెయిన్ బజార్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

క్లుప్తంగా

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

ఆత్మకూరు: ఆత్మకూరు పోలీస్ సర్కిల్ పరిధిలో ఎవరైనా బెల్టు షాపులను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు సీఐ జీ గంగాధర్ హెచ్చరించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఎస్సై షేక్ జిలానీతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలో బెల్టు షాపులను కట్టడి చేసేందుకు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామన్నారు. ఎక్సైజ్, పోలీస్ శాఖలు సంయుక్తంగా దాడులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

శ్రీవారి పాదాల ఘటనపై దర్యాప్తు ముమ్మరం



బిట్రగుంట: బోగోలు మండలం కొత్తూరు–తాళ్లూరు మార్గంలోని 'శ్రీవారి పాదాలు' గుడిలో దేవుడి పటాలు దగ్ధమైన ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. గురువారం కావలి డీఎస్పీ శ్రీధర్, సీఐ పాపారావు గుడిని, దగ్ధమైన పటాలను పరిశీలించారు. ఘటనపై ఎస్సై భోజ్యా, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. సాంకేతిక పరిజ్ఞానం, ఇతర ఆధారాలతో భిన్న కోణాల్లో విచారణ చేపట్టేలా దర్యాప్తు ప్రక్రియను ముమ్మరం చేశారు. గేదెలు, గొర్రెలను మేపుకునే వారి నుంచి కూడా వివరాలు సేకరించారు.

వెంగమాంబకు పల్లకిసేవ



దుత్తలూరు: నర్రవాడలో కొలువైన వెంగమాంబ పేరంటాలు అమ్మవారికి పల్లకిసేవను గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం చందనాలంకారం, కుంకుమార్చన నిర్వహించారు.

బహుమతుల ప్రదానం



అనుమసముద్రంపేట/ఉదయగిరి: ఏఎస్‌పేట ఆదర్శ పాఠశాల, ఉదయగిరిలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రతిభా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఆదర్శ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ హుస్సేన్‌పీరా, ఏఎస్‌పేట లైబ్రేరియన్ శ్రీనివాసరాజు, ఆదర్శ పాఠశాల లైబ్రేరియన్ వేణు, నాణేల సేకరణ కర్త ఎండీ వాయిజ్, నిర్వాహకులు ఈవీ చలపతిరావు, ఎంఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నారాయణ స్వామి,గ్రంథాలయ అధికారులు సునీల్‌కుమార్, వెంకటేశు, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఏ.నరసింహులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ఏసీఎస్‌ఆర్ కాలనీకి చెందిన కూనిపోగు రవి తీవ్ర అనారోగ్య సమస్యలతో నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. అతని ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న నేపథ్యంలో డాక్టర్ బీఎస్సార్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ షకీలా రూ.10వేలు ఆర్థిక సాయాన్ని గురువారం ప్రకటించారు. రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి సాధిక్ హుస్సేన్, జేవీవీ ఆత్మకూరు శాఖ నిర్వాహకుడు హరికృష్ణ, ఒంటేరు మల్లికార్జున, హనుమంతు, తదితరులు బాధితుడికి నగదును అందజేశారు.

మద్యం విక్రేత అరెస్ట్

మర్రిపాడు: మర్రిపాడుకు చెందిన నాయబ్‌రసూల్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో ఉదయగిరి ఎక్సైజ్ ఎస్సై దీప్తి కరంత్ గురువారం దాడులు చేసి పట్టుకున్నారు. అతని వద్ద నుంచి పది మద్యం బాటిళ్లు, టీవీఎస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన



వింజమూరు(ఉదయగిరి): మండలంలోని బుక్కాపురం, ఏ కిస్తీపురం, చింతలపాళెం గ్రామాల్లో జరుగుతున్న సీసీరోడ్లు, పశువుల షెడ్ల నిర్మాణ పనులను ఎంపీడీఓ శ్రీనివాస రెడ్డి గురువారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధి హామీ, ఎన్టీఆర్ హౌసింగ్ పథకాలపై సమీక్షించారు. సచివాలయ సిబ్బంది చేపడుతున్న హౌస్‌హోల్డ్ జియోట్యాగింగ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బుక్కాపురం పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు.

28 వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ



మాట్లాడుతున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి: కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ముసాయిదా ఓటర్ల జాబితాపై ఈ నెల 28వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తున్నామని, అందులో భాగంగా ఇంటింటికి వస్తున్న బీఎల్వోలకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు, మరణించిన వారి ఓట్లు ఉంటే తొలగించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఓట్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉంటే మార్చుకోవచ్చని చెప్పారు. ఓట్ల చేర్పులు, మార్పులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18ఏళ్లు నిండే వారికి ఓటు హక్కు నమోదుకు అవకాశాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాలు, బీఎల్వోల వద్ద సంబంధిత పత్రాలను అందుబాటులో ఉంచామని వివరించారు. ఓటర్లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బీఎల్వోలకు దరఖాస్తులను అందజేస్తే పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటారని వివరించారు. వచ్చే ఏడాది జనవరి 6న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు.

వీఓఏపై టీడీపీ నాయకుడి దాడి

చేజర్ల: తనపై అకారణంగా టీడీపీ నాయకుడు దాడి చేశాడని నాగులవెల్లటూరుకు చెందిన పొదుపు వీఓఏ సుజాత చేజర్ల పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది.గ్రామంలోని అంబేడ్కర్ పొదుపు గ్రూపులో పది మంది సభ్యులు ఉండగా, ఓ సభ్యురాలు రెండేళ్లుగా లోన్ నగదు చెల్లించడం లేదని తెలిపారు. ఈ విషయమై ఈ నెల 19న సాయంత్రం 6 గంటలకు పొదుపు సభ్యులతో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం లోన్ కట్టని సభ్యురాలు, మిగిలిన సభ్యుల నడుమ వాదోపవాదాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. ఈ క్రమంలో ఓ సభ్యురాలిపై లోన్ కట్టని సభ్యురాలు కారం పొడి చల్లిందన్నారు. దీంతో కారం పొడి చల్లిన సభ్యురాలిపైకి మిగిలిన సభ్యులు రావడంతో గ్రామంలోని సీనియర్ టీడీపీ నాయకుడి ఇంటికి వెళ్లిందన్నారు. అక్కడ గొడవ జరుగుతుండగా తాను వెళ్లగా టీడీపీ నాయకుడి బయటకొచ్చి నానా దుర్భాషలాడి కొట్టాడని వీఏఏ ఫిర్యాదులో పేర్కొంది.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



సోమశిల: రేవూరులో పడి పూజోత్సవం

జలదంకి: బ్రాహ్మణక్రాకలోని శివాలయంలో గొట్టిగుండాల మహదేవరెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ మహోత్సవాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. బ్రాహ్మణక్రాక పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప మాలధారులు పెద్ద ఎత్తున పాల్గొని భజనలు చేశారు. అనంతరం అయ్యప్పలకు అన్నప్రసాద వితరణ చేశారు.

సోమశిల: అనంతసాగరం మండలం రేవూరులోని సాయిబాబా మందిర ప్రాంగణంలో జేఎన్నార్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత బోయిళ్ల జనార్దన్‌రెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో అయ్యప్పపడి పూజ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అయ్యప్ప, విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యస్వామిని కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు విశేషంగా పాల్గొని భజనలు చేశారు. ఆలపించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

టిడ్కో గృహ లబ్ధిదారుల ఆందోళన



కావలి: పట్టణంలోని మద్దూరుపాడులో ఉన్న టిడ్కో గృహాల లబ్ధిదారులు బ్యాంకర్ల నోటీసులపై గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహాల నిర్మాణం పూర్తి చేసి స్వాధీనం చేసిన రోజు నుంచి ఈఎంఐ నగదు చెల్లించాల్సి వస్తుందని, అప్పటి వరకు చెల్లించాల్సిన అవసరం లేదని అధికారులు చెప్పారన్నారు. మూడు నెలల క్రితం తమకు గృహాలు స్వాధీనం చేశారని తెలిపారు. ఇటీవల బ్యాంకు అధికారులు వచ్చి నాలుగు సంవత్సరాల నుంచి గృహాలకు సంబంధించిన ఈఎంఐలు చెల్లించాలని నోటీసులు అంటించారని చెప్పారు. ఈఎంఐలు చెల్లించని పక్షంలో గృహాలను స్వాధీనం చేసుకుంటామని బెదిరించి వెళ్లారని వాపోయారు. కాగా బాధితులతో జనసేన జిల్లా కార్యదర్శి సమ్మను వెంకటసుబ్బయ్య మాట్లాడారు. సమస్యను ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

నత్తనడకన లిఫ్ట్ నిర్మాణ పనులు



కావలి: పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ నిర్మాణ పనులు నత్తనడకగా సాగుతున్నాయి. ఆరు నెలల క్రితం నిర్మాణ పనులను ప్రారంభించారు. నేటికీ కట్టుబడి పనులు కూడా పూర్తి కాలేదు. ఈ పనులు పూర్తయిన తర్వాత విద్యుత్, లిఫ్ట్ ఏర్పాటు పనులకు మరో నెల రోజుల సమయం పడుతోంది. కట్టుబడి పనుల్లోనే తీవ్ర జాప్యం జరుగుతుండడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. లిఫ్ట్ సౌకర్యం లేక రైల్వే స్టేషన్‌లో పట్టాలు దాటే క్రమంలో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. అయినప్పటికీ రైల్వేశాఖ లిఫ్ట్ నిర్మాణ పనులపై నిర్లక్ష్యం వహిస్తుండడంపై ప్రయాణికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మోసపోయిన కుటుంబాన్ని ఆదుకున్న ఆర్డీఓ



కావలి రైల్వేస్టేషన్‌లో బాధితుడు నాగేశ్వరరావు

కావలి: కావలి ఆర్డీఓ వంశీకృష్ణ తన మానవత్వం చాటుకున్నారు. ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తి నమ్మబలకడంతో కావలికి వచ్చి మోసపోయిన కుటుంబానికి తిరిగి వెళ్లేందుకు రవాణా చార్జీలతో పాటు దారి ఖర్చులకు నగదు సాయాన్ని అందజేసి ఆదుకున్నారు. వివరాలు.. అల్లూరి సీతారామరాజు జిల్లా మంచంపుట్ట మండలం గంపరాయి గ్రామానికి చెందిన కర్రెగొర్ల నాగేశ్వరరావుకు కావలికి చెందిన ఎం చందు అనే వ్యక్తి పరిచయమయ్యాడు. కుటుంబంతో సహా కావలికి వస్తే ఉద్యోగం గ్యారెంటీ అని నమ్మబలికాడు. దీంతో నాగేశ్వరరావు కుటుంబాన్ని వెంట పెట్టుకుని కావలికి రాగా అతని వద్ద ఉన్న రూ.5వేలు నగదును తీసుకుని చందు కాజేశాడు. అనంతరం జాడ లేకుండా మాయమైపోయాడు. దీంతో మోసపోయానని గ్రహించిన నాగేశ్వరరావు తన స్వగ్రామానికి వెళ్లడానికి చార్జీలకు సైతం నగదు లేక కుటుంబసభ్యులతో కలిసి కావలి ఆర్డీఓ కార్యాలయానికి గురువారం చేరుకున్నాడు. ఆర్డీఓ ఎం వంశీకృష్ణను కలిసి తన గోడు వెల్లబోసుకున్నాడు. స్పందించిన ఆర్డీఓ మానవత్వంతో వారికి దారి ఖర్చులతో పాటు చార్జీలకు అవసరమైన నగదు అందజేశారు. దీంతో నాగేశ్వరరావు తన కుటుంబాన్ని తీసుకుని రైలెక్కి తన స్వగ్రామానికి వెళ్లిపోయాడు.

సమగ్ర ఎరువుల యాజమాన్యంపై అవగాహన



కలిగిరి: వెలగపాడులో మినుము పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కావలి: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని రుద్రకోటలో సమగ్ర ఎరువుల యాజమాన్యంపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారిణి గీతాకుమారి భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పంటల సాగు, ఎరువుల వినియోగం, సూక్ష్మపోషకాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కావలి ఏఓ ఏ లలిత, ఏఈఓ శ్రీహరి పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: మండలంలోని పెద్దబ్బీపురం, గుడిపాడు రైతుసేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ టీ రజని వరిసాగులో ఎరువుల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు, సేంద్రియ, జీవన ఎరువుల ఉపయోగాలు, కాలిబాటల ఆవశ్యకత, కలుపు యాజమాన్యం ,తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ ఏ మాధవరెడ్డి, ఏఈఓ చిరంజీవి, వీఏఏలు బీ ప్రసాద్, మంజుల, వెటర్నరీ అసిస్టెంట్ మసూద్ పాల్గొన్నారు.

కలిగిరి: వెలగపాడు రైతుసేవా కేంద్రం పరిధిలోని కొత్తూరులో మినుము పంటను నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. పొగాకు లద్దెపురుగు, ఆకుమచ్చ తెగులును గుర్తించి సస్యరక్షణ చర్యలను సూచించారు. పొగాకు లద్దె పురుగు నివారణకు ఎకరాకు 200 మి.లీ. నోవల్యూరాన్, ఆకుమచ్చ తెగులు నివారణకు ఎకరాకు ట్రైకోనాజోల్ 200 మి.లీను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. నూతన ఎన్‌బీఈజీ -452, ఎన్‌బీఈజీ-776 రకం పచ్చిశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త శివజ్యోతి, శాస్త్రవేత్తలు లోకేష్‌బాబు, విజయ్‌కుమార్‌నాయక్, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఓ సురేష్, వీఏఏ వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.